కంటెయినర్‌లో చనిపోయిన ఎడ్లు

ఊపిరాడక 15 ఎడ్లు మృతి

- కంటెయినర్‌లో అక్రమరవాణా
- సూర్యాపేట జిల్లాలో పట్టివేత

మఠంపల్లి, మే 29 : కంటెయినర్‌లో ఎడ్లను అక్రమంగా రవాణా చేస్తుండగా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ముఠా 26 ఎడ్లను కంటెయినర్‌లో తరలిస్తున్న క్రమంలో 15 ఎడ్లు ఊపిరాడక మృత్యువాత పడగా, రెండింటికి కాళ్లు విరగడంతో పశువైద్యాధికారులు చికిత్స అందిస్తున్నారు. మిగిలిన 9 ఎడ్లను నల్లగొండ జిల్లా కేంద్రంలోని గోశాలకు తరలించారు. చనిపోయిన ఎడ్లకు మట్టపల్లిలో పశువైద్యాధికారులు పంచనామా చేసి కళేబరాలను గొయ్యిలో పూడ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి!

కొత్తగూడెం క్రైం, మే 29 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య భీకరపోరు జరిగింది. ఈ పోరులో ఓ మహిళా మావోయిస్టుతోపాటు మరో దళసభ్యుడు మృతిచెందిన ఘటన బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగింది. బద్దిపారా అడవుల్లో మావోయిస్టులున్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. తిరిగి జవాన్లు కాల్పులు జరపడంతో మావోయిస్టులు అడవిలోకి పారిపోయారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాలపాటు భీకరపోరు జరిగినట్టు తెలుస్తున్నది.

ట్రిపుల్‌ఆర్ భూసేకరణ అసంపూర్ణం

- ఉత్తర భాగానికే ఇంకా వెయ్యి ఎకరాలు అవసరం
- 198 ఎకరాల అటవీ భూమిని సేకరించాల్సిన పరిస్థితి
- మొత్తం ఖర్చంతా కేంద్రమే భరించాలని రాష్ట్రం వినతి

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్‌ఆర్)లో ఉత్తర భాగం కోసం ఇంకా దాదాపు 1,000 ఎకరాలను సేకరించాల్సి ఉన్నది. ఈ భాగం నిర్మాణానికి మొత్తం 4,571.44 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా.. రైతుల నుంచి ఇప్పటివరకు 3,583.02 ఎకరాలు సేకరించారు. మిగిలిన 988.42 ఎకరాల సేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో 197.68 ఎకరాల అటవీ భూమి సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో కేంద్ర చట్టాలకు అనుగుణంగా ఆ భూమికి బదులు వేరే భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహబూబాబాద్, మెదక్, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని అటవీ శాఖకు బదిలీ చేయనున్నట్టు కేంద్రానికి తెలిపింది.

భూసేకరణ ఖర్చంతా కేంద్రమే భరించాలని లేఖ

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి రూ.9,164 ఖర్చవుతుందని 2021లో అంచనా వేయగా.. ప్రస్తుతం అది మరో రూ.6 వేల కోట్ల వరకు పెరిగింది. ఇందులో భూసేకరణకే దాదాపు రూ.5 వేల కోట్లకుపైగా ఖర్చు కానున్నది. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)తో కుదిరిన ఒప్పందం ప్రకారం భూసేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాల్సి ఉన్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు కొరవడటంతో భూసేకరణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్రమే భరించాలని కోరుతున్నది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీకి లేఖ రాయాలని నిర్ణయించింది.

కోర్టు కేసులపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు

రాయగిరి పరిధిలోని 4 ప్రాంతాల్లో ట్రిపుల్ ఆర్ భూసేకరణపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేత కోసం ప్రభుత్వం న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నది. ఉత్తర భాగం నిర్మాణానికి ఇప్పటికే అలైన్‌మెంట్ ఖరారై భూసేకరణ కూడా చాలావరకు పూర్తయినందున సాధ్యమైనంత మేరకు రైతులను ఒప్పించి ఆందోళన విరమింపజేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇది సాధ్యం కాకపోతే అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేయాలని యోచిస్తున్నారు. కోర్టు కేసులు ఉన్నందున అలైన్‌మెంట్ మార్పును పరిశీలించాలని అధికారులు ఇదివరకే ఎన్‌హెచ్‌ఏఐకి లేఖ రాశారు. దీనిపై కేంద్రం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

ప్రాజెక్టు పురోగతిపై మంత్రి సమీక్ష

ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టు పురోగతిపై రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కోర్టు కేసుల పరిష్కారం, భూసేకరణ తదితర సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిశాక సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దక్షిణ భాగం రోడ్డుకు డీపీఆర్ రెడీ

187.2 కి.మీ. పొడవైన ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి కూడా సమగ్ర ప్రాజక్టు నివేదిక (డీపీఆర్)సిద్ధమైంది. దీన్ని త్వరలో కేంద్రానికి సమర్పించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగాన్ని వికసిత్ భారత్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేంద్రాన్ని కోరింది. ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాక కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వంపై దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

జూన్ 3 నుంచి బడిబాట

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్‌ను బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన విడుదల చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంపు కోసం ఉద్దేశించిన బడిబాటను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను, జిల్లా విద్యాధికారులను కోరారు. షెడ్యూల్ ప్రకారం అంశాల వారీగా బడిబాట నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, డీఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయుల బాధ్యతలను శ్రీదేవసేన తెలియజేశారు. బడులు ప్రారంభం కాకముందు ఒక షెడ్యూల్, బడులు ప్రారంభమైన తర్వాత మరో షెడ్యూల్‌తో ఈ విధంగా రెండు వేర్వేరుగా మార్గదర్శకాలను వెల్లడించారు.

కలెక్టర్లదే ప్రధాన పాత్ర

బడిబాట నిర్వహణకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, లేబర్ డిపార్ట్‌మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, వెల్ఫేర్ డిపార్టుమెంట్, జిల్లా మహిళా సమాఖ్యలతో కలిసి ఈ నెల 30 లోపు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించాలి. జిల్లా స్థాయిలో అన్ని పంచాయతీల వారీగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో బడిబాట నిర్వహించాలి. ఇందులో భాగంగా జూన్ 10 లోపు ఒక యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లను పంపిణీ చేయాలి.

బడిబాట కార్యక్రమాలు

- అర్హత ఉన్న అంగన్‌వాడి పిల్లలను సమీపంలోఉన్న ప్రాథమిక బడిలో ఒకటో తరగతిలో చేర్పించాలి.
- బడి బయట పిల్లలను గుర్తించాలి. అలాగే డ్రాపౌట్స్, బడికి పోని పిల్లలు, చాలాకాలంగా స్కూల్‌కు హాజరుకాని వారిని గుర్తించి బడిలో చేర్పించాలి. ఈ విషయంలో ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సహాయం పొందాలి.
- బాల కార్మికులను గుర్తించి, వారిని సంబంధిత బడిలో చేర్పించాలి.
- జూన్ 8 లోపు ఆన్‌లైన్ ప్రమోషన్ చేయాలి.
- జూన్ 12 నుంచి 19 వరకు బడుల పున:ప్రారంభ సమయంలో తల్లిదండ్రులకు స్వాగతం పలకాలి. కమ్యూనిటీ అండ్ ప్రజాప్రతినిధులు సంప్రదాయక పద్ధతుల్లో బడిబాట నిర్వహించాలి.

ఓఎంఆర్ విధానంలో గ్రూప్–1 ప్రిలిమినరీ

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నామని, ఇందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు గంట ముందుగానే అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించింది. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షాకేంద్రంలోకి అనుమతిస్తామని, ఉదయం 10 గంటలకే గేట్లు మూసివేస్తామని వెల్లడించింది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి పరిస్థితులో అనుమతించబోమనిసూచించింది. ఇందుకు మార్గదర్శకాలను బుధవారం టీఎస్‌పీఎస్సీ అధికారులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్–1 ప్రిలిమినరీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. జూన్ 1నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు ఉంచుతామని తెలిపారు.

అచ్చంపేటలో గోడౌన్ సీజ్

అచ్చంపేట, మే 29 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు బియ్యం గోదాముపై బుధవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ బృందం ఓఎస్డీ ద్రోణాచార్య ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులు ప్రభాకర్, వెంకటేశ్వర్‌రావు, సాంబశివరావు దాదాపు ఐదు గంటలపాటు స్టాక్ పాయింట్‌లో తనిఖీలు చేపట్టారు. వచ్చిన బియ్యం నిల్వలు, సరఫరా చేసిన వివరాలు పరిశీలించి బియ్యం బస్తాలు లెక్కించారు. వేలిముద్రలు లేకుండా పంపిణీ చేసిన 200 బస్తాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు, రికార్డులో నమోదైన స్టాక్‌కు పొంతన లేదని పేర్కొంటూ గోడౌన్‌ను సీజ్ చేశారు.

గోదామును సీజ్ చేస్తున్న అధికారులు

విద్య ప్రాముఖ్యతపై వీడియో ప్రాజెక్ట్

- ఏఐ ఆధారంగా రూపొందించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు
- ఈ వీడియో ద్వారా బడిబాట ప్రచారం
- షరీఫ్ అహ్మద్‌కు తోటి ఉపాధ్యాయుల ప్రశంసలు

వీడియోలో ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలు, విద్య ప్రాముఖ్యతను వివరిస్తున్న షరీఫ్ అహ్మద్

చిగురుమామిడి/కమాన్ చౌరస్తా(కరీంనగర్) మే 29: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించి విద్య ప్రాముఖ్యతపై ప్రమోషనల్ వీడియో రూపొందించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ టీచర్ షరీఫ్ అహ్మద్, కరీంనగర్ సుభాష్‌నగర్ జడ్పీ హైస్కూల్ తెలుగు టీచర్ మోతె చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ రూరల్ మండలం వట్టెంల హైస్కూల్ హెడ్మాస్టర్ సూర్యనారాయణ విద్యార్థులు, తల్లిదండ్రులకు సర్కారు విద్య ప్రాముఖ్యతపై వినూత్న పద్ధతిలో అవగాహన కల్పించాలని సంకల్పించారు. ఈ దిశగా ఆధునిక పరిజ్ఞానాన్ని అంటే కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారంగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యావిధానం, సౌకర్యాలు, నాణ్యమైన బోధన తదితర అంశాలను వివరిస్తూ ఇటీవల ఓ ప్రమోషనల్ వీడియో తయారు చేశారు. బడిబాటలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో తల్లిదండ్రులకు ఈ వీడియోను చూపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఫలితంగా తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారని ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ తెలిపారు.

ఫీజు బకాయిల కోసం రోడ్డెక్కుతున్న కాలేజీలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): గత పదేండ్లలో తొలిసారిగా రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు రోడ్డెక్కబోతున్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవటంపై నిరసన చేపట్టనున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని ప్రైవేటు జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలతో పాటు ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. అందులోభాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద 31న శాంతియుత దీక్ష నిర్వహించనున్నామని, అందుకు అనుమతి కోసం పోలీసులకు లేఖ రాసినట్టు బుధవారం ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం తెలిపింది.

జూన్ 3న లాసెట్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : మూడేండ్లు లా, ఐదేండ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు జూన్ 3న లాసెట్, పీజీ లాసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బీ విజయలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షలను మొదటి విడత ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మూడో విడత (పీజీలాసెట్) సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు హాల్‌టికెట్లకు http://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

టీ-హబ్ 'పోర్టల్'కు రూ.24 కోట్ల నిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): వ్యాయామం, ఆరోగ్యానికి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించే టీ-హబ్ స్టార్టప్ పోర్టల్‌కు సిరీస్ 'ఏ' ఫండింగ్‌లో భాగంగా ఒకేసారి 3 మిలియన్ డాలర్లు (రూ.24 కోట్లు) సమకూరాయి. భారత్ ఇన్నోవేషన్ ఫండ్ నిధులను పోర్టల్ స్టార్టప్ కంపెనీ తన వ్యాపార కార్యకలాపాల విస్తరణ, మరిన్నీ నూతన ఆవిష్కరణలకు ఉపయోగించనుంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ సేవలు అందిస్తున్నది.

జూన్ 12 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని విద్యాశాఖలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలను జూన్ 12 నుంచి 21 వరకు నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. పరీక్షల వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు.

ఫిజికల్ సైన్స్ టీచర్లకు మెమో అసంబద్ధం:ఎఫ్‌పీఎఫ్‌టీ

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ బడుల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్లు 6వ, 7వ తరగతుల గణితం పాఠాలు చెప్పాలని విద్యాశాఖ జారీ చేసిన మెమో అసంబద్ధంగా ఉన్నదని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్లు (ఎఫ్‌పీఎఫ్‌టీ) తెలిపారు. దీనివలన బడుల్లో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు ఫోర్ ఆఫ్ ఫిజికల్స్ సైన్స్ టీచర్స్ అధ్యక్షుడు టీ అజయ్‌సింగ్, కార్యదర్శి పీ ప్రభాకర్ వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ నిర్ణయంతో ఫిజికల్ సైన్స్ టీచర్లకు అధిక పనిభారం పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

'మాడల్' టీచర్ల బదిలీలు చేపట్టాలి : టీఎస్ పీఆర్టీయూ

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూళ్ల టీచర్లను, ఇతర బడుల టీచర్లను బదిలీ చేయాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను పీఆర్టీయూ తెలంగాణ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆశయం నెరవేరాలంటే బడులు ప్రారంభం కాకముందే టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయిన జోన్–2 పదోన్నతులు వెంటనే చేపట్టాలని, మార్చి, ఏప్రిల్, మే లో పదవీ విరమణ పొందిన వారికి పదోన్నతి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

' తెలంగాణ ఇంటర్మీడియట్ పేరును మార్చండి'

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ పేరును.. తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్‌గా మార్పు చేయాలని ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ పీ మధుసూదన్ ఇంటర్ విద్యాశాఖను కోరారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని బుధవారం బోర్డు సెక్రటరీ వినతిపత్రం అందజేశారు.

'ఓయూలో ఏ కోర్సులు మూసివేయడం లేదు'

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ కోర్సులను మూసివేస్తున్నట్టు వచ్చిన వార్తలు నిరాధారమైనవని వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పర్షియన్, మరాఠీ, కన్నడ, అరబిక్, థియేటర్ ఆర్ట్స్ విభాగాల పీజీ కోర్సులను మూసివేస్తున్నట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండించారు. ఈ కోర్సులను అభ్యసించేందుకు ఆసక్తి గల విద్యార్థులు సీపీజీఈటీ – 2024కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. పూర్తి సమాచారం కోసం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

మైనార్టీ గురుకుల ప్రిన్సిపాళ్లకు డీడీవో అధికారాలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకుల ఉద్యోగుల సెలవులు, ఇంక్రిమెంట్ల మంజూరు, వేతనాల డ్రాయింగ్ అధికారాలను ప్రిన్సిపాళ్లకే అప్పగించనున్నట్టు మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అయేషామస్రత్ ఖానమ్ స్పష్టం చేశారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జంగయ్య, చావ రవి గురుకుల సొసైటీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీలు, పదోన్నతులు కల్పించే అంశంపైనా కార్యదర్శి హామీ ఇచ్చినట్టు సంఘం సభ్యులు పేర్కొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు కల్పించండి: ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జరిగే ప్రమోషన్లు, బదిలీల్లో తమకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్లు బుధవారం ఎక్సైజ్ కమిషనర్ ఈ శ్రీధర్‌కు విన్నవించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా సభ్యత్వం గురించి కమిషనర్, అసోసియేషన్ అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు. వినతులపై ఎక్సైజ్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు సమావేశానికి హాజరైన పది ఉమ్మడి జిల్లాల కార్యవర్గసభ్యులు పేర్కొన్నారు.

అవినీతి సొమ్ముతో 'రియల్' వ్యాపారం

ఏసీపీ ఉమామహేశ్వర్‌రావును కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల అరెస్టయిన సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావును బుధవారం ఏసీబీ కస్టడీలోకి తీసుకున్నది. ఈ నెల 21న ఆయన ఇండ్లతోపాటు బంధువులు, స్నేహితుల ఇండ్లలో ఏసీబీ అధికారులు ఏక కాలంలో సోదాలు నిర్వహించి భారీగా నగదు, నగలు, ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం ఉమామహేశ్వర్‌రావును మూడో రోజులపాటు ఏసీబీకి అప్పగించాలని నాంపక కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి ఉమామహేశ్వర్‌రావును కస్టడీలోకి తీసుకున్నారు. సీసీఎస్‌లో సాహితీ ఇన్‌ఫ్రా కేసుతోపాటు పలు ఇతర కేసుల దర్యాప్తులో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉమాహేశ్వర్‌రావు కొందరు పోలీసు అధికారులు, రాజకీయ నాయకులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసినట్లు ఏసీబీ గుర్తించింది. ఆయన లాప్‌టాప్‌లోని వివరాలపై లోతుగా ఆరా తీయనున్నారు.

జూన్1 నుంచి కొత్త ట్రాఫిక్ రూల్స్

- మైనర్ వాహనం నడిపితే రూ.25 వేల జరిమానా

హైదరాబాద్, మే29 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నది. జూన్ 1నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.1000 నుంచి రూ.2000 వరకు ఫైన్ విధిస్తారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా వేస్తారు. మైనర్ వాహనం నడిపితే రూ.25వేలు ఫైన్ విధించటంతో పాటు మైనర్‌కు 25ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా ఆంక్షలు విధిస్తారు. జూన్ 1నుంచి డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్టీఏ ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు. డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందవచ్చు.

టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మి అరెస్ట్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): హత్యాయత్నం కేసులో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మిని బుధవారం అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె భర్త గిరీశ్‌చంద్రారెడ్డి, మరో ఇద్దరిని కూడా పోలీసులు అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 25న తిరుపతి ఎన్జీవో కాలనీలో నివాసముండే వెంకటశివారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేటు దవాఖానలో బాధితుడు చికిత్స పొందుతున్నారు. అపార్ట్‌మెంట్ ముందే బైక్‌తో శివారెడ్డిని అడ్డగించి ఇద్దరు వ్యక్తులు ఆయనపై దాడి చేసినట్టు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. అపార్ట్‌మెంట్‌లో వెంకటశివారెడ్డి ఫ్లాట్‌కు ఎదురుగా నివాసముండే శ్రీలక్ష్మి దంపతులు ఆయనతో గతంలో అనేకసార్లు గొడవకు దిగారు. ఈ విషయాన్ని సీసీ కెమెరాలో గుర్తించిన పోలీసులు.. విచారణ అనంతరం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

తిరుమలలో 12 గంటల్లో సర్వదర్శనం

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. రూ.300 శ్రీఘ్ర దర్శనానికి 3 గంటలు, టోకెన్ పొందిన భక్తుల సర్వదర్శనానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతుందని తెలిపారు. తిరుమలలోని నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన బుధవారం చక్రస్నానంతో ఉత్సవాలు ముగిశాయి.

ద్వారకాతిరుమల ఆలయానికి స్వర్ణ కిరీటం

- 140 గ్రాముల బంగారు కిరీటం అందజేత

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు బంగారు కిరీటాన్ని కానుకగా అందజేశారు. ద్వారకాతిరుమలకు చెందిన మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీ రమణి దంపతులు వారి కుటుంబసభ్యులతో కలిసి రూ.10.50 లక్షల విలువ గల బంగారు కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాతలు ఈ కిరీటాన్ని 140గ్రాముల బరువుతో తయారుచేయించారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

నేడు ఏపీలో ఐసెట్, ఈసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఐసెట్, ఈసెట్ ఫలితాలను అధికారులు విడుదల చేయనున్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈసెట్–2024 ఫలితాలను గురువారం ఉదయం 11 గంటలకు అనంతపురం –జేఎన్‌టీయూలో విడుదల చేయనున్నట్టు ఈసెట్ చైర్మన్ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి వెల్లడించారు. మే 8న ఏపీ ఈసెట్ పరీక్షలు నిర్వహించగా, 36,369మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏ